క్లుప్తంగా

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, డాక్టర్ హరీష్‌మోహన్ తదితరులు

డాబాగార్డెన్స్: విద్యార్థులు చదువుతో పాటు పలు రంగాలలో రాణించి వ్యవస్థాపకులుగా ఎదగాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల పిలుపునిచ్చారు. కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం వుమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎంఏ నివేదిత కన్వీనర్‌గా వ్యవహరించిన కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ డాక్టర్ హరీష్ మోహన్ ఆర్గానిక్ ఫార్మింగ్ ప్రాముఖ్యత, ఏ విధంగా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలి, అందుకు చేయాల్సిన కృషి తదితర అంశాలను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలు, గ్రీన్‌క్లబ్ కన్వీనర్ డాక్టర్ జె. లావణ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఎస్. అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి



అల్లిపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ ట్రాఫిక్ ఎస్.ఐ లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి రైల్వే స్టేషన్ ఎదుట 70 సంవత్సరాల వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఆమె అక్కడికక్కడే మృతి చెందడంతో ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐని 9440796041 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రాణాంతకంగా మారుతున్న మొబైల్ ఫోన్ ఆటలు

పిల్లలు, యువతపై చెడు ప్రభావం చూపుతున్న గేమింగ్ యాప్‌లు

కుటుంబాలపైనా దుష్ప్రభావం

కిల్లర్ గేమ్స్





డాబాగార్డెన్స్: సెల్‌ఫోన్లు అనేక మంది జీవితాల్లో చిచ్చు రేపుతున్నాయి. వీటి వల్ల ఎంత ఉపయోగం ఉందో.. అంతకు ఎన్నో రెట్లు దుష్ప్రభావం కూడా ఉంది. సెల్‌ఫోన్లు పిల్లల చదువులను, యువత భవిష్యత్‌ను పాడు చేస్తున్నాయి. మొబైళ్లలోని వీడియో గేమ్స్ అన్ని వర్గాలపై పెను ప్రభావం చూపుతున్నాయి. ఆటాడుకుందాంరా.. అని వేటాడుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లలో ఇటీవల కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఫోర్ట్‌నైట్ గేమ్ వ్యసనంగా మారడంతో ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయి. ప్రజలు మొబైల్ వీడియో గేమ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఇటీవల మొబైల్ యాప్‌లలో అందుబాటులోకి వస్తున్న సరికొత్త వీడియో గేమ్స్ యువతను, పిల్లలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. వారికి నూతన ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నాయి. ఇదంతా నాణేనికి ఓ వైపు మాత్రమే. వీటి వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయనే విషయం యథార్థం. వింత వింత వీడియో గేమ్స్‌కు అతుక్కుపోతుండడం, గంటల కొద్దీ సమయం వృథా చేస్తుండడంతో పిల్లలు చదువులను అశ్రద్ధ చేస్తున్నారు. యువత తమ కెరీర్‌పై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. అలాగే కుటుంబాలపైనా పెను ప్రభావమే చూపుతుంది. ఈ గేమ్స్ ఆడటం వ్యసనంగా మారడంతో జీవనశైలి మార్పులపై ప్రభావం చూపుతోంది. ఉద్యోగులు మానసిక ఒత్తిడిని జయించే క్రమంలో గేమ్స్‌కు బానిసలుగా మారిపోతున్నారు. దంపతులు సైతం తమ విలువైన జీవితాల్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. కుటుంబాల్ని నిర్లక్ష్యం చేస్తుండడంతో కలహాల కాపురాలుగా మారిపోతున్నాయి. భార్యాభర్తలు ఎక్కువ సేపు స్మార్ట్‌ఫోన్లతోనే గడుపుతుండడంతో సమస్య తీవ్రత పెచ్చుమీరుతోంది.





మానసికంగా.. శారీరకంగా..

రోజంతా కంప్యూటర్ల ముందు కూర్చొని గేమ్స్ ఆడేవారిలో మానసిక సమస్యలతో పాటు శారీరక సమస్యలు తలెత్తుతున్నాయని అధ్యయనాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఎక్కువ సమయం వీడియో గేమ్‌లకు కేటాయిస్తున్న వారిలో నిద్రలేమి, ఏకాగ్రత లోపించడం, మతిమరుపు మొదలైన రుగ్మతలు చోటు చేసుకుంటున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే వీడియో గేమ్‌లలో చూపిస్తున్న మితిమీరిన యాక్షన్, అశ్లీల దృశ్యాలు చిన్నారుల్ని, యువతను చెడుదోవ పట్టించే ప్రమాదం లేకపోలేదు. అందుకే మొబైల్ వీడియో గేమ్‌లతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

వ్యసనంలా మారితే ప్రమాదం..

మేం పరిశీలించిన వారిలో ఎక్కువ మంది స్మార్ట్ ఫోన్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫోన్ ఎంత వరకు ఉపయోగమో.. అంత వరకు వినియోగిస్తేనే మంచిది. అంతకు మించి ఎక్కువగా ఫోన్స్ వినియోగిస్తే ప్రమాదాలకు దారి తీయొచ్చు. ఇక గేమ్స్ విషయానికొస్తే.. అవి లెవల్స్ పెరిగే కొద్దీ తీవ్ర ఒత్తిడికి గురవ్వడమే కాకుండా, ఓటమి పాలైతే కోపం, అసహనంతో పాటు రక్తపోటుకు కూడా దారి తీయొచ్చు. మానసిక సంఘర్షణకు గురవుతూ ఎదుటి వారిపై కోపం వ్యక్తం చేస్తుంటారు. ఇవి కుటుంబ ఘర్షణలకు దారితీసే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ తరహా గేమ్స్‌కు దూరంగా ఉంటే మంచిది.

–డాక్టర్ కె. రామిరెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ మానసిక వైద్యశాల

హామీలు అమలు చేయాలని ధర్నా



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బీసీహెచ్ మసేను మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వాహనమిత్రలకు రూ. 15 వేలు ఇస్తామని, జీవో నంబర్ 21,31 సవరిస్తామని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే 9 నెలలు గడిచినా ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ పెరిగిన డీజిల్, పెట్రోల్, సీఎన్జీ గ్యాస్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ వంటివి నడ్డి విరుస్తుంటే ఊబర్, ఓలా, ర్యాపిడ్ వాహనాలకి ప్రభుత్వం అనుమతి ఇచ్చి ఆటో, మోటార్ కార్మికులకు ఆదాయం లేకుండా చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, జిల్లా ప్రెసిడెంట్ ఎం.మన్మథరావు, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల రమణ, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, పడాల గోవిందు, సీహెచ్ సాయికుమార్, రాంబాబు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సాయంత్రం కూడా అమ్మవారికి జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.

రోజారాణికి వాసుపల్లి ఆర్థిక సాయం



రోజారాణికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి రోజారాణికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రోజారాణి బుధవారం వాసుపల్లికి గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ సోషల్ మీడియాలో వైఎస్సార్‌సీపీ నేతలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు హల్చల్ చేస్తున్నాయన్నారు. రోజారాణిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు మహిళ అని చూడకుండా న్యూడ్ ఫొటోలు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని, ఇలా దిగజారడం సిగ్గుచేటన్నారు. నిజమైన ప్రజాసేవ చేసే తమ నేతలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొమ్మిది నెలల కూటమి పాలనపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో తేలిపోయిందన్నారు. దానిని కప్పిపుచ్చుకోవడానికి టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి తమ మద్దతు వల్లే గెలిచారని కూటమి నేతలు ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదమన్నారు. పార్టీ విశాఖ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సకాలబత్తుల ప్రసాద్, పలు వార్డుల నాయకులు పీతల వాసు, ముత్తాబత్తుల రమేష్, భీశెట్టి ప్రసాద్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ, భాను, యువజన విభాగం అధ్యక్షుడు తాడి రవితేజ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్‌కుమార్, బెవర మహేష్, సూర్యనాయుడు, అప్పారావు, చింతకాయల వాసు, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆహార నియమాలు పాటిస్తే చక్కటి ఆరోగ్యం



యోగా పట్ల అవగాహన కల్పిస్తున్న యోగా థెరపిస్ట్

డాబాగార్డెన్స్: పీసీవోడీ, ఒబేసిటీపై ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడారు. విద్యార్థులు చక్కటి ఆహార నియమాలు పాటిస్తూ, యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా థెరపిస్ట్ సీహెచ్ పుష్పలత విద్యార్థులకు యోగా పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, కళాశాల వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ ఎస్. అనురాధ, దుర్గాబాయి దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ ప్రతినిధి డాక్టర్ కె. రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ లావణ్య, డాక్టర్ బి. హైమావతి, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె. గీతాంజలి, అధిక సంఖ్యలో విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి ఎక్స్‌పో



భారత్ ప్రో సౌండ్ లైట్ ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: వచ్చే నెల 11, 12, 13 తేదీల్లో పోర్టు స్టేడియం విశ్వనాథ్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న భారత్ ప్రో సౌండ్ లైట్ ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరణ బుధవారం నగరంలోని ఓ హోటల్లో సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో దిలీప్‌కుమార్ సోనార్, ఉత్తరాంధ్ర ఈవెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాశీప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఎక్స్‌పోలో సుమారు 100 కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పెదిరెడ్ల శ్రీనివాస్, హరిబాబు, నగేష్, నూకేష్, చిన్న, శేఖర్, దాడి శ్రీనివాస్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా విభూది బుధవారం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సెయింట్ పీటర్స్ ఫాదర్లు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ పీటర్స్ ప్రధాన దేవాలయంలో బుధవారం చర్చి విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ఆధ్వర్యంలో విభూది బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్సు కాల దీక్షలు నేటి నుంచి ప్రారంభించి 45 రోజుల పాటు చేపట్టే ఉపవాస దీక్షలకు సుమారు 300 మంది మాలధారణ చేపట్టినట్లు ఫాదర్ జాన్ ప్రకాష్ తెలిపారు. ముందుగా దివ్యబలి పూజలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఫాదర్ జాన్‌ప్రకాష్ దీక్షాపరులకు జపమాల ధారణ చేశారు. కార్యక్రమంలో ఫాదర్స్ ఆంథోని రాజ్, వినయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సిస్టర్లు, పీపీసీ పాలక వర్గ సభ్యులు, ఆలిండియా క్యాథలిక్ యూనియన్ సభ్యులు, అధిక సంఖ్యలో కథోలిక క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: ఈ నెల 10 నుంచి 16 వరకు పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నగరేశ్వరస్వామి (వింధ్యవాసన), జనార్దన స్వామి (కోనకమలాదేవి) దేవేరుల పరిణయ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు మాట్లాడుతూ దేవాలయంలో నిర్వహించనున్న ఈ పరిణయ కార్యక్రమం శైవాగమ విద్వాన్ చంద్రమౌళి ప్రభాకర సత్యనారాయణ శర్మ, చంద్రమౌళి మల్లీశ్వరి శర్మ బ్రహ్మత్వంలో ఆలయ ప్రధాన అర్చకుడు రాంబిల్లి బుచ్చి భాస్కర శర్మ నేతృత్వంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆర్యవైశ్యులు పాల్గొని దేవేరుల కృపాకటాక్షాలు పొందగలరని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉత్సవాల ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ప్రమిదల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కల్లూరి సత్తిబాబు, పెనుగొండ చంద్రశేఖర్, సీవీఎస్ రామకృష్ణ, పాలూరి వరప్రసాద్, కట్టమూరి సూర్యనారాయణ, గ్రంధి దుర్గాప్రసాద్, పాలూరి రామకృష్ణ పరమహంస తదితరులు పాల్గొన్నారు.

మార్షలింగ్ యార్డ్ పరిశీలన



మార్షలింగ్ యార్డ్‌లో మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా బుధవారం గూడ్స్ రవాణా కు ప్రాముఖ్యమైన మార్షలింగ్ యార్డ్‌లో పర్యటించారు. మార్షలింగ్ యార్డ్‌కు అనుబంధంగా గల రిసెప్షన్ యార్డ్, డిస్పాచ్ యార్డ్, ఓవర్ ఎక్స్‌చేంజ్ యార్డుల పనితీరును పరిశీలించారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ కేబిన్ నిర్వహణ, ట్రాఫిక్ సంబంధిత అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఆయనతోపాటు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట : విశాఖ రత్న కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 31న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విశాఖ రత్న కళాపరిషత్ జాతీయ రత్న ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.వి.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి వయసుతో సంబంధం లేకుండా జాతీయ రత్న ఉగాది పురస్కారాలు – 2025 అందజేస్తామన్నారు. సంగీతం, సాహిత్యం, భరతనాట్యం, కూచిపూడి, జానపదం, నాటక, క్రీడా రంగం, చిత్రలేఖనం, మిమిక్రీ, మ్యాజిక్, ఆధ్యాత్మికం, వైద్యం, సమాజ సేవకులు, చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ఉగాది పురస్కారాలకు అర్హులని పేర్కొన్నారు. అవార్డుకు దరఖాస్తు చేసుకోదలచిన వారు వ్యక్తిగత వివరాలతోపాటు, రెండు కలర్ ఫొటోలు, ఆధార్ కార్డు పీడీఎఫ్ ద్వారా 98484 81767కు ఈ నెల 15లోగా వాట్సాప్ చేయాలని కోరారు.

పథకాలపై అవగాహన అవసరం



ప్రశంసాపత్రాలు అందుకున్న మహిళలతో అతిథులు, అధికారులు

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు ఊర్వశి కూడలి పరిధి జై భారత్‌నగర్‌లో కేంద్ర ప్రభుత్వ సాంఘిక భద్రతా పథకాలపై దోత్తపంత్ తెంగడి జాతీయ కార్మిక విద్యా – అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గంకల కవిత సదస్సు ప్రారంభించి మాట్లాడారు. స్వల్ప వ్యవధి శిక్షణతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ – శ్రమ్ పోర్టల్‌లో చేరిన కార్మికులు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల వరకు ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. కార్మిక విద్యాధికారి రెడ్డి నాగార్జున మాట్లాడుతూ కార్మికులందరూ విధిగా కేంద్ర ప్రభుత్వ సాంఘిక భద్రత పథకాల కోసం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. శ్రమ యోగి మానధాన్ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనపై అవగాహన కల్పించారు.

పూర్ణామార్కెట్‌లో చిరు వ్యాపారుల ధర్నా




పూర్ణామార్కెట్‌లో ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల వర్తకులు




ఆందోళనకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ జీడీ బాబు

జగదాంబ: కూటమి ప్రభుత్వం పేదలకు ఒక న్యాయం, ధనవంతులకు ఒక న్యాయం అన్నట్లు పాలిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం. సుబ్బారావు అన్నారు. మంగళవారం ఆయన పూర్ణామార్కెట్ వద్ద చిరు వ్యాపారులతో కలిసి ధర్నా నిర్వహించారు. నగరంలో పెద్ద షాపింగ్ మాల్స్‌కు ఎక్కడ పార్కింగ్ స్థలం ఉందని ప్రశ్నించారు. మార్కెట్ ఏర్పడిన నాటి నుంచి బతుకుతున్న చిరు వ్యాపారులను పార్కింగ్ పేరులో తొలగించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. మార్కెట్‌లో లోపల ఉన్న బడా వ్యాపారుల కుట్ర వల్లనే చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించారన్నారు. తమకు న్యాయం జరగకపోతే పోలీస్ కమిషనర్, కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామని సుబ్బారావు తెలిపారు. అనంతరం మార్కెట్ వద్దకు వచ్చిన వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ జీడీ బాబు సిఐటియు నాయకులు, చిరు వ్యాపారులతో మాట్లాడారు. దుకాణాల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం. సుబ్బారావు, మత్యకార రాష్ట్ర అధ్యక్షుడు కర్రి చంద్రశేఖర్, సభ్యులు వెంకట్, సత్య, రాము, వరాలు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా రేణుక యల్లమ్మ జాతర ప్రారంభం



విద్యుత్ కాంతుల్లో అమ్మవారి ఆలయం



అమ్మవారి ఆభరణాల తిరువీధి ఉత్సవం

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అమ్మవారిని సిద్ధం చేసేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆభరణాల తిరువీధి ఉత్సవం అంగరంగ వైభవంగా చేపట్టారు. తొలుత అమ్మవారి ఉత్సవ విగ్రహానికి బృందావన్ లాడ్జి జంక్షన్‌లో గల ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు ఇంటి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి నగలను పల్లకిలో కాళీమాత వేషధారుల నృత్యాలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, తప్పిటగుళ్లు, తోడపెద్దులతో సరస్వతీ పార్కు మీదుగా యల్లమ్మ అమ్మవారి దేవస్థానానికి తిరువీధిగా చేరుకున్నారు. అనంతరం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన జిల్లా బాలభవన్ విద్యార్థులతో ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నేడు అమ్మవారి తొలేళ్ల ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు తెలిపారు. శుక్రవారం అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు.

నేడు 'విశాఖ-బ్రహ్మపూర్' రద్దు

తాటిచెట్లపాలెం : ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6,7 తేదీల్లోను, బ్రహ్మపూర్-విశాఖపట్నం (18525) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7, 8వ తేదీల్లో రద్దయినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం-పలాస (67289) పాసింజర్ ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు (శుక్ర, ఆదివారం తప్ప) శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో పలాసలో బయల్దేరాల్సిన పలాస-విశాఖపట్నం (67290) పాసింజర్ ఈ నెల 9 నుంచి 16 వరకు (శుక్ర, ఆదివారం తప్ప) పలాస నుంచి కాకుండా శ్రీకాకుళం నుంచి బయల్దేరుతుంది.